



# పండా

జగన్నాథ శర్మ



వేసవి రాత్రి
చలి రాత్రి
వర్షా రాత్రి

ఏ రాత్రయినా పండా పాట వినిపిస్తుంది. అర్థరాత్రి కవులే కాదు, పండా కూడా మేల్కొని వుంటాడు.

వాడి గొంతు బాగోదు. రాగతాళాలుండవు. ఒరియా వాడు కావడంతో వాడి తెలుగు ఉచ్ఛారణలో తప్పులుండవచ్చు. అయినా వాడి పాట బాగుంటుంది.

'రావోయి చందమామ!
మా వింత గాధ వినుమా'

అంటే చంద్రుడు ఎక్కడున్నా రావాల్సిందే! పండా పాట వినాల్సిందే! పూరింటి గడపలో, కుక్కి నులక మంచంలో, చిరుగుల బొంతలో పండా పడుకుని వుంటాడు. పాడుతూ అందర్నీ మేల్కొలుపుతాడు.

చూరుకి ఇటు వేపున హరికెన్ లాంతరు, అటు వేపున చిలక పంజరం వేలాడుతుంటాయి. మధ్యలో పండా, మంచంలో పాటను పట్టుకుని పెనుగులాడుతుంటాడు.

వాడికి తండ్రి లేడు. పోయి చాలా యేళ్ళయింది. తల్లి వుంది. విస్తర్లు కుడుతుంది. అదామె వృత్తి.

పాతికేళ్ళ వరకు పండా బాగానే వున్నాడు. అందరిలాగే కను ముక్కు తీరుతో అందంగానే వున్నాడు. తర్వాత వచ్చిందా వ్యాధి. మచ్చమచ్చలుగా మొదలయి, పెచ్చు పెచ్చులుగా రాలిపడి, పండాని కురూపిని చేసింది. కుష్ఠురోగిని చేసింది.

దాంతో కరచాలనాల్లేవు. కౌగిలింతల్లేవు. స్నేహితుల్లేరు. ఒంటరి వాడయ్యాడు పండా.

ముప్పొద్దులూ ఇంట్లోనే వుంటాడు. పగలంతా పెరట్లో వుంటాడు. మొక్కలు నాటుతాడు. గొప్పులు తవ్వుతాడు. నీళ్ళు పోస్తాడు. పువ్వు పూసినా, కాయ కాసినా ప్రేమగా చేతుల్లోనికి తీసుకుంటాడు.

వద్దువద్దని జారిపోవవి. ముద్దుముద్దుగా వొదిగిపోతాయి. కళ్ళ కద్దుకుంటాడు వాటిని. గుండెలకు హత్తుకుంటాడు.

చీకటి వేళ -

చిలకతో ఇంట్లో వుంటాడు. దానికి మాటలు మప్పుతాడు. పాటలు నేర్పుతాడు.

వాడంటే చిలక్కి ప్రాణం. దాని ప్రాణం వాడిలో దాచుకున్నట్టుగా వుంటుంది. వాడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంది. అందీ అందకుండా ఎగురుతుంది. అంతలోనే వచ్చి భుజమ్మీద వాలుతుంది. వాడి సొట్ట ముక్కును గీకుతుంది. వాడి పుచ్చి బుగ్గను గోకుతుంది.

రాత్రి -

గడపలో, కుక్కి నులక మంచంలో, చిరుగుల బొంతలో పాడుతూ సేద దీరుతాడు.

ఏ రేజామునో నిద్రపోతాడు పండా. వాడు నిద్రపోయాడంటే వాడవాడంతా నిద్రపోయినట్టే!

ఆ ఉదయం విస్తర్ల షావుకారువచ్చాడు. గడపలో పండాని చూసి గతుక్కుమన్నాడు. వాడి తల్లిని పిలిచి నానా మాటలూ అన్నాడు. రిక్షాలోంచి విస్తర్ల కట్టలు దించి, విసిరేశాడు.

"బతుకు లేదంటే మరో పనిచెయ్! మరో పని చెయ్! అంతేగాని పది మంది తినే విస్తర్లలో విషం లాంటి ఈ వ్యాధిని కలపకు" అన్నాడు. పండా వ్యాధిని పట్టిపట్టి చూశాడు. విసవిసా వెళ్ళిపోయాడు.


ఉన్న ఊళ్ళో విస్తర్ల అమ్మకం జరగదు. పండాని చూసి, వాళ్ళింటి విస్తర్లెవరూ కొనరు. షావుకారు పొన్నూరు వాడు. సంతలో ఆమె విస్తర్లు కొని పట్టుకు పోయేవాడు. ఆమెకు కుష్ఠురోగి కొడుకున్నాడని, అతనికెలా తెలిసిందో తెలిసింది. మొన్న కొన్న కట్టల్ని ముట్టుకోవడానికే భయపడ్డాడు. తెచ్చి పడేశాడు.

పాచి పనికి కూడా పిలవరు పండా తల్లిని. మరే రకంగా బతకాలి? కొడుకుని ఎలా బతికించుకోవాలి?

గగ్గోలుగా ఏడిచిందామె.

"పోయి చావు! నీతో పాటు నన్నెందుకు చంపుతావు" అన్నది. పండాపై కోపగించు కున్నది.

రాత్రి రెండయింది. అప్పటి వరకు పండా అన్నీ విషాదగీతాలే పాడాడు. నిద్ర గొంతో, ఏడుపు గొంతో తెలియదుగాని, ప్రతి పాటా భారంగా వినిపించింది. తర్వాత మరి పాటల్లేవు. పండా నిద్ర పోయాడను కున్నారంతా




తెల్లారింది.

గడపలో పండా లేడు. చూరులో చిలక పంజరం లేదు. ఊరి చెరువులో ఇద్దరూ తేలుతూ కన్పించారు. చిలకెగిరిపోయింది.

పండాని పువ్వులు కాదనలేదు.

పక్షులు కాదనలేదు.

గాలి, నీరూ కాదనలేదు.

కాదన్నదెవరు?

నువ్వు నేనూ!! ●

